1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

మంగళవారం | 21 మే 2024 | www.navatelangana.com

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.47.50 లకలు



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీఏడుపాయల వన దుర్గామాత 70 రోజుల ఆలయ హుండీని సోమవారం ఏడుపాయల గోకుల్ షేడ్‌లో లెక్కించినట్లు ఆలయ చైర్మన్ ఎస్.బాలా గౌడ్,ఈఓ పి.మోహన్ రెడ్డి తెలిపారు. దేవస్థాన ఆలయ అసిస్టెంట్ కమీషనర్ శివరాజ్, ఇన్స్పెక్టర్ రంగారావు,పర్యవేక్షణలో హుండీని లెక్కించగా రూ. 47,50,681/-లు వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో సిరిసిల్ల, కామారెడ్డికి చెందిన రాజరాజేశ్వరి మాత సేవ సంస్థకు చెందిన 150 మంది భక్తులు పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు యాదగౌడ్, అరే మోహన్రావు, మనోహర్, చక్రపాణి, వెంకటేశం, బాగా రెడ్డి, సిద్ధిరాములు, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, బలరాం తదితరులు పాల్గొన్నారు. లెక్కింపు సందర్భంగా పాపన్నపేట ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



నవతెలంగాణ- వెల్దుర్తి

గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మాసాయిపేట మండలం బీఆర్ఎస్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజ్ మరి కొంతమందితో కలిసి కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చేతులకు తీసుకొని డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ ధన్‌సింగ్‌కు చూపించారు. రైతులను ఆదుకుంటామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా లేకపోవడం వల్లనే వర్షాల్లో తడిసి ముద్దవుతున్నాయన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బోనస్ రూ.500లు చెల్లిస్తామని చెప్పి చెల్లించడం లేదన్నారు. వెంటనే బోనస్ రూ.500 లు రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి త్వర త్వరగా వడ్లను కొనుగోలు చేయాలని వారు కోరారు. దేశానికి వెన్నుముక అయిన రైతును పట్టించుకోవాలన్నారు.

సన్నాలకే.... రూ.500 బోనస్

- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- దొడ్డు వడ్లు పండించే రైతులకే నో బోనస్
- ఖరీఫ్ వరి సాగులో 90 శాతం దొడ్డు రకమే
- సర్కారిచ్చే బోనస్ తెగుళ్లకు చాలదంటున్న రైతులు
- ప్రభుత్వం పునరాలోచించాలి: జయరాజ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తేల్చేసింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం చేసింది. సర్కార్ నిర్ణయంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఖరీఫ్, యాసంగీ సీజన్‌లో సాగయ్యే వరిలో దొడ్డు రకం 90 శాతం ఉంటుంది. దీంతో అత్యధిక మంది అన్నధాతలకు బోనస్ అనేది అందని ద్రాక్ష కానుంది. సన్న రకాల్ని సాగు చేస్తే సర్కారిచ్చే బోనస్ లీటర్ పురుగు మందుకు కూడా సరిపోదని రైతులు వాపోతున్నారు. ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామన్న ఎన్నికల హామీ ఎండమావిగా మారిందని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.

90 శాతం దొడ్డు రకమే సాగు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. పత్తి తర్వాత అత్యధికంగా వరి పంట సాగవుతుంది. సాగయ్యే వరిలోనూ 90 శాతం దొడ్డు రకం వడ్లే పండిస్తున్నారు. ఖరీఫ్‌లో కొంత మేరకు సన్నలు సాగు చేసినా అవి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి అమ్ముకునే పరిస్థితి ఉండదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 150831 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులోనూ 1.30 ఎకరాల్లో 1010 ఇతర దొడ్డు రకాల ధాన్యాన్నే పండిస్తారు. 20 వేల ఎకరాల వరకే సన్నలు సాగు అవుతాయి. మెదక్ జిల్లాలో 3.05 లక్షల ఎకరాల్లో వరి సాగవనుందని అంచనా వేశారు. ఇందులోనూ 90 శాతం దొడ్డు రకం ధాన్యమే పండిస్తారు. సిద్ధిపేట జిల్లాల్లోనూ 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగవనుంది. మూడు జిల్లాల్లో కలిపి 50 వేల ఎకరాల్లోనే సన్నలు సాగయ్యే అవకాశముంది. రైతులు తమకున్న మొత్తం పొలంలో పూర్తిగా సన్నలు సాగు చేసే పరిస్థితి ఉండదు. ఐదెకరాలున్న రైతు 4 ఎకరాల్లో దొడ్డు రకం వేసి ఎకరంలోనే సన్నలు సాగు చేస్తారు.

సన్నలు సాగు చేసినా ఐకేపీలకు తేరు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సాగు చేసే వరిలో సన్నలు కొంత మేరకే ఉంటది. బీపీటీ, సోనమసూరి, సాంబమసూరి వంటి సన్న రకాలు సాగు చేసే రైతులు కొంత తమ కుటుంబ అవసరాలకు ఉంచుకుంటారు. మిగతా ధాన్యాన్ని స్థానికంగా ఉన్న వ్యాపారులు, మిల్లర్లు ఎంఎస్‌పీ కంటే అదనంగా ధర ఇచ్చి కొనుగోలు చేస్తారు. దీంతో సన్న రకం ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకునే పరిస్థితి ఉండదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ రైతులకు అందని ద్రాక్షే అవ్వద్ది. దొడ్డు రకం ధాన్యానికి ఉన్న ఎంఎస్‌పీ కంటే సన్న రకాలకు ఐదారు వందలు అధికంగా చెల్లించి వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తుండడంతో వారికే విక్రయిస్తారు. ప్రభుత్వం ఇస్తామనే రూ.500 బోనస్ కోసం రైతులు అదనంగా సన్నలు సాగు చేసే పరిస్థితి లేదు. ఎందుకంటే సన్న రకాల వరి సాగు చేయడం పెద్ద ఖర్చుతో కూడుకున్న పనిగా ఉంటది. సన్నలు ఆరు నెలలకు దిగుబడి వస్తుంది. దొడ్డు రకాల కంటే అదనపు పంట కాలముంటది. దీంతో యాసంగీ పంట సాగుకు ఆలస్యమవ్వద్ది. ఖరీఫ్‌లో సన్నలు సాగు చేస్తే అధికంగా తెగుళ్లు ఆశిస్తాయి. రకరకాల తెగుళ్ల సోకి పంట దెబ్బతింటది. దాన్ని కోసం రైతులు పంట కాలం సమయంలో ఐదారు సార్లు పురుగుల మందుల్ని పిచికారి చేయాలి. దీంతో రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. పైగా దొడ్డు రకం ఎకరాలకు వచ్చే దిగుబడి కంటే సన్న రకాలు చాలా తక్కువ దిగుబడి వస్తుంది. తూకంలోనూ తేడా ఉంటది. తాలు, ఇతర వ్యర్థాలు కూడా సన్నలకే ఉంటాయి. దీంతో రైతులు సన్నల సాగు లాభసాటి కాదని చెప్పి దొడ్డు రకం వరి సాగు వైపే మొగ్గు చూపుతారు.



అందని ద్రాక్ష బోనస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతుల్లో ఎక్కువ మంది దొడ్డు రకం ధాన్యాన్నే పండిస్తున్నందున ప్రభుత్వం ఇచ్చే బోనస్ అందని ద్రాక్ష కానుంది. వరి సాగు ఖర్చులు ఏటేటా పెరుగుతున్నాయి. డీజిల్ ధరల ప్రభావంతో దున్నకం, ఇతర ఖర్చులు పెరిగాయి. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రేబర్ ఖర్చులు కూడా పెరిగాయి. వరి సాగులో పూర్తిగా యంత్రాలతోనే పని చేస్తున్నందున పెట్టుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు. మద్దతు ధర పెంపులో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పిన బోసన్ అంద కుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి

: జి..జయరాజ్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు



రైతులు పండించే ధాన్యానికి కాకుండా కేవలం సన్న రకాలకే బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలి. రైతులు దొడ్డు రకం ధాన్యాన్నే 90 శాతం పండిస్తున్నారు. సన్నలు సాగు చేసిన అవి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మే పరిస్థితి ఉండదు. అందుకే రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏ రకం ధాన్యం పండించినా బోనస్ ఇవ్వాలి. బోనస్ విషయంలో ప్రభుత్వం మాట మార్చడం సరైందికాదు. బోనస్ చెల్లింపుల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

భూముల విలువ పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రియల్ ఎస్టేట్ వ్యాపార సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం



నవతెలంగాణ-సిద్దిపేట

భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజలింగం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం ముస్తాబాద్ ధర్నా చౌక్ వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, భూముల విలువ పెంపు ప్రకటనను ఉపహసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అంతంత మాత్రంగా సాగుతున్న రియల్ వ్యాపారం భూములు విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో కుంటుబడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రియల్ వ్యాపారం కుంటుబడి వ్యాపారులు ఉపాధి కోల్పోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. మహాధర్నాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి దరిపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి జువ్వన్న శంకర్, జిల్లా నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వంగ మల్లారెడ్డి, రంగయ్య, మొయిజ్, దేవేందర్, కృష్ణ, బోనాల నర్సింలు, వెంకన్న, మల్లేశం, కనుకయ్య ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-కోహెడ

ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ హరీష్‌కుమార్, టైపిస్ట్ లక్ష్మివిద్యాలతలకు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపుమేరకు రెండురోజులుగా మండలంలోని వడ్ల కల్లాలను సందర్శించామన్నారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం ఆలస్యం చేస్తుండడంతో అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే రైతుకు అండగా నిలబడి పెద్దఎత్తున రైతు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగ్గిళ్ళ శ్రీనివాస్, మ్యాకల రజినీకాంత్‌రెడ్డి, బండ జగన్, చేపూరి తిరుపతి, కక్కెర్ల దామోదర్, కంది సత్యనారాయణ, మామిడి కరుణాకర్, కొండబత్తిని సతీష్, ఎడమల రాజిరెడ్డి, ముంజ సాగర్, ఉత్తునూరు శ్రీకాంత్, బండ సుమన్, నాగు అజయ్, పుట్ట లక్ష్మణ్, భీంరెడ్డి లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, తాటిపాముల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ధాన్యం కొనుగోలు కేంద్రాల సమగ్ర నివేదికలు తయారు చేయడం, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్ సమస్యలపై సంబంధిత ఎమ్మార్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ఇప్పటివరకు ఎగుమతి, దిగుమతి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం సంబంధిత వివరాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో ప్రజావాణి దరఖాస్తులు తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో ఆన్లైన్ లాగిన్ పాస్వర్డ్ ఇవ్వడం జరిగిందని, ప్రజలు అందించిన పెండింగ్ దరఖాస్తులను తీసుకున్న చర్యలపై ఆన్లైన్లో క్లియర్ చేయాలన్నారు. జటిలమైన సమస్యలపై అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటన చేసి నివృత్తి చేయాలన్నారు. ప్రజావాణి సమస్యలను జూన్ 7వ తేది వరకు పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు

మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రంలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని హవేలీ ఘనపూర్ మండల వ్యవసాయ అధికారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జీలుగు విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జీలుగు విత్తనాల ధర రూ.1130, జనుము విత్తనాలు రూ.1448 ల ధర ఉండగా 40 కిలోల బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో రైతు సంస్థ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, రైతులు పోచయ్య పిట్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతుల్లో సమస్యలను అధిగమించాలి

- మిల్స్ స్టోరేజ్ కెపాసిటీపై దృష్టి సారించాలి
- క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులను అంచనా వేయాలి
- తహశీల్దార్లు, ఆర్డీవోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హెూళికేరి

నవతెలంగాణ-మెదక్

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించి ఎగుమతి, దిగుమతి, మిల్లింగ్ స్టోరేజ్ కెపాసిటీ సమస్యలపై సంబంధిత విషయాలను పరిష్కరించే విధంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి భారతి హెూళీ కేరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సివిల్ సప్లై ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలు, రవాణా ఇబ్బందులు, మిల్లర్స్ కెపాసిటీ, సీ.ఎం.ఆర్ జిల్లాలో అమలు తీరు సంబంధిత విషయాలపై మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డిఓలు రమాదేవి, శ్రీనివాస్, జయచంద్రారెడ్డి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఏవో గోవింద్, డిసిఓ కరుణ, సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు తహశీల్దారులతో ప్రత్యేక అధికారి భారతీ హెూళికేరి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలను అధిగమించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమయానికి రవాణా చేసి రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎగుమతి చేసుకోవడానికి మిల్లింగ్ కెపాసిటీ సరి చూసుకోవాలని, లేని పక్షంలో సిద్దిపేట, మహబూబ్ నగర్ జిల్లాల మిల్స్‌కు ధాన్యాన్ని ఎగుమతి చేయాలని చెప్పారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని చెప్పారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలి

క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల ప్రతికూల అంశాలను ఎప్పటికప్పుడు ఆర్డీవోలు తహశీల్దార్లు పర్యవేక్షించాలని భారతీ హెూళికేరి ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 321 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు దగ్గర నుంచి ధాన్యం సేకరించినట్లు చెప్పారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలతో తీసుకురావాలని అవగాహన కల్పిస్తూ, నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. వాతావరణ అసమతుల్యత కారణంగా వర్షాల ప్రభావంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పలిన్స్‌తో కప్పి రక్షించుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్స్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ధాన్యం దిగుమతికి లారీల కొరత లేకుండా చూడాలని ఎగుమతి చేసిన ధాన్యాన్ని పెండింగ్ లేకుండా దిగుమతి చేసుకుని రైతులకు భరోసా కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చి కాంటా పెట్టిన ధాన్యం ఎంత ఉంది, కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం, ఇంకా కొనుగోలు కేంద్రాలకి రావాల్సిన ధాన్యం ఎంత ఉంది. ఈ అంశాలపై స్పష్టతకు వచ్చి వీటికి సంబంధించి సమగ్ర నివేదికలు, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



'సాయి కృష్ణ హాస్పిటల్'పై వైద్యశాఖ సీరియస్

- హాస్పిటల్‌లో స్పెషల్ టీం విచారణ
- పలు రికార్డులు స్వాధీనం

స్పందన

నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట పట్టణంలోని సాయి కృష్ణ హాస్పిటల్‌లో గర్భిణీకి హైపటైటిస్ బి పాజిటివ్ ఉన్నట్లు తప్పుడు రిపోర్టు ఇచ్చిన విషయంతో పాటు, ప్రసవంలో తల్లి బిడ్డ మృతి చెందిన విషయం 'నవతెలంగాణ' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. 'నవతెలంగాణ' కథనాలకు స్పందించిన వైద్యశాఖ అధికారులు ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకుంది. సోమవారం ప్రత్యేక వైద్య బృందం సాయి కృష్ణ హాస్పిటల్‌లో విచారణ జరిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ అనిలా, మెటర్నటీ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయనిర్మల నేతృత్వంలో సాయి కృష్ణ హాస్పిటల్‌లో రికార్డులు తనిఖీ చేశారు. స్కానింగ్ మిషన్, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ప్రసవంలో మృతి చెందిన బైరం ఎస్తర్ (27) కు చెందిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పూర్తి నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేస్తామని, తదుపరి చర్యలు జిల్లా వైద్యాధికారులు తీసుకుంటారని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ అనిలా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ హరిప్రియ, రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ లింబాద్రి, వైద్య సిబ్బంది జయలక్ష్మి తో పాటు పలువురు ఉన్నారు.



రైతులకో న్యాయం.. నాయకులకు మరోక న్యాయమా?

- నాయకుల తడిసిన వడ్లు తూకం చేయడం
- వరి కోసిన రెండు రోజుల్లోనే వడ్లను లారీలల్లో ఎక్కించడం
- 20 రోజుల నుంచి రైతుల వడ్లు లారీల్లో నింపకపోవడం ఏమిటి?



నవ తెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రైతులు గత 20 నుంచి 25 రోజులుగా వరి కోతలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలు చేసి తూకం చేయమని నిర్వాహకులను అడగ్గా సీరియల్ రావాలి వచ్చినప్పుడే కాంట పెడతామని రైతులను సెంటర్ల చుట్టూ రోజుల తరబడి తిప్పుతున్నారు. అకాల వర్షానికి ఎండిన వడ్లు తడిసి ఒకపక్క మొలకలు రావడం జరుగుతుంది. అయినా రైతులు మళ్లీమళ్లీ ఆరబెట్టి వరి ధాన్యాన్ని శుద్ధి చేయడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. కానీ గ్రామానికి చెందిన ఇద్దరు ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గుమ్ముల విజయ్ వారికి సంబంధించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టకుండానే తడిసిన ధాన్యం వరికోసిన ఒకటి రెండు రోజులలో బస్తాలు నింపి ధాన్యాన్ని లారీలల్లో ఎక్కించడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులేమో కొనుగోలు సెంటర్ల చుట్టూ తిరుగుతూ తడిసిన వడ్లను అష్టకష్టాలు పడుతూ మళ్లీ మళ్లీ ఆరబెట్టి సీరియల్ కొరకు ఎదురు చూస్తే నాయకులేమో ఇండ్ల దగ్గర వరి ధాన్యం పోసుకొని రాత్రికి రాత్రి ధాన్యాన్ని బస్తాలలో నింపి లారీలల్లో ఎక్కించడమేమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకో న్యాయం, నాయకులకు మరోక న్యాయమా అని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అంతే అధికారం లేనప్పుడు అంతేనా? ఇలా కొనసాగితే రైతుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.సెంటర్లలో రైతుల బస్తాలు తూకం వేసి లారీలు రాక రైతులు ఇబ్బంది పడుతుండగా , అప్పటికప్పుడు నాయకులకు లారీలు తెప్పించి ధాన్యాన్ని నింపి తరలించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నాయకుల పెత్తనమేంటని, నస్కల్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు లేరా?అనే అనుమానాలకు తావిస్తుంది. ఉంటే రైతుల పక్షాన ఎందుకు మాట్లాడడం లేదని గ్రామస్తులు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా అధికారులు రైతుల ధాన్యాన్ని వీలైనంత తొందరగా లారీలు పంపించి ధాన్యాన్ని తరలించాలని రైతులు వేడుకుంటున్నారు. ఇలాగే కొనసాగితే సెంటర్ల దగ్గర ధర్నా చేస్తామని రైతులు పేర్కొన్నారు.

పోలీసుల పహారా మధ్య జీలుగు విత్తనాల పంపిణీ

- వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు సరిపడా విత్తనాలు అందలేవు
- మండలానికి ఎన్ని సరిపోతాయో తెలియని పరిస్థితి
- వ్యవసాయ అధికారులపై మండిపడ్డ రైతులు



నవతెలంగాణ-చిలిపిచెడ్

పోలీసుల పహారా మధ్య వ్యవసాయ అధికారులు రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రమైన చిలిపిచెడ్‌లోని రైతు ఆగ్రోస్ సేవా కేంద్రానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయి. జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఆగ్రోస్ రైతు సేవ కేంద్రానికి తరలివచ్చారు. రైతులు ఎక్కువ కావడంతో పోలీసు పహారా మధ్య వరుస క్రమంలో రైతులను నిలబెట్టి పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తెచ్చిన వారికి జీలుగు విత్తనాల బస్తాలు అందజేశారు. ఆగ్రోస్ రైతుసేవ కేంద్రంకు 300 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు అవసరం ఉందని వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి పెట్టగా 100 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. దీంతో కొంతమంది రైతులకే జీలుగా విత్తనాలు అందగా మరికొంతమంది వరుసలో నిలబడ్డ రైతులకు జీలుగు విత్తనాలు అందకపోవడంతో నిరాశతో వెనుతిరిగి ఇంటికి వెళ్లిపోయారు. వ్యవసాయ అధికారుల ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు వారికి కావలసిన వారికి మాత్రమే పంపిణీ చేసినట్లుగా కనిపిస్తుందని, మండలంలో రైతులకు ఎన్ని సరిపోతాయో అనే విషయం కూడా తెలియని వ్యవసాయ అధికారులు మండలంలో పనిచేస్తున్నారని రైతులు మండిపడ్డారు.



కార్యదర్శులపై ఆర్థిక భారం పడకుండా చూడాలి

- ఖర్చు చేసిన డబ్బులు ఇప్పించాలి
- ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించిన పంచాయితీ కార్యదర్శులు

నవ తెలంగాణ-నర్సాపూర్

గ్రామపంచాయతీలలో జరిగే పనుల నిర్వహణకు పంచాయితీ కార్యదర్శులు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టే విధానం నుంచి తమను మినహాయించాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ ఎంపీడీవో మధులతకు మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో రోజువారి పనుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు రాకపోవడంతో గ్రామపంచాయతీ పనుల నిర్వహణకు గ్రామ కార్యదర్శుల జేబుల నుంచి ఖర్చు పెట్టి గ్రామ పంచాయతీలను నడుపుతున్నారన్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణకు ట్రాక్టర్ డీజిల్, శానిటేషన్, బోర్ల రిపేర్లు, పైప్ లైన్‌ల లీకేజీలు, వీధి దీపాల నిర్వహణ వంటి పనులకు కార్యదర్శులు తమకు వచ్చే నెల జీతం నుంచి ఖర్చు పెడుతున్నామని తెలిపారు. తమకు వచ్చే జీతం గ్రామ పంచాయతీల నిర్వహణకు అవుతుండగా కుటుంబ పోషణ భారమై అప్పులపాలవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల నుంచి గ్రామపంచాయతీలకు ఎలాంటి నిధులు రానందున ఎంపీడబ్ల్యూ వర్కర్స్ జీతాలు కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. జూన్ 1 నుంచి ఎంపీడబ్ల్యూ వర్కర్ లు విధులకు హాజరు కాలేమని తెలియజేస్తూ వినతి అందజేశారు. ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం నుంచి ఇప్పటివరకు కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు పెట్టిన డబ్బులు కూడా ఇవ్వాలని కోరారు. ఈ ఆర్థికపరమైన భారాన్ని పంచాయతీ కార్యదర్శులపై పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు మల్లేశం, తారా సింగ్, రమేష్, వంశీ , రవి, లలిత, సంగీత, ఊహ, శృతిజ, స్రవంతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చి రొట్ట, జనుము, జీలుగా విత్తనాలు

• ఏడిఏ బిక్షపతి



నవతెలంగాణ -జహీరాబాద్

జహీరాబాద్ మండలంలో రైతులకు సబ్సిడీపై జనుము జీలుగా విత్తనాల పంపిణీ కి సిద్ధంగా ఉన్నాయని జహీరాబాద్ వ్యవసాయ ఏడి బిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాల పూర్తి ధర 9050 రూపాయలు కాగా సబ్సిడీ రూ. 5400 పోను రైతులు క్వింటాలుకు 3620 రూపాయలు, 40 కిలోల బస్తాకు 1448 రూపాయలు చెల్లించి తీసుకోవచ్చని అన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పర్మిట్ పొంది డీసీఎంఎస్ కౌంటర్ జహీరాబాద్ వద్ద విత్తనాలు తీసుకోవాలని సూచించారు. తొలకరి వర్షాలు మొదలైన తర్వాత భూమిలో సరైన తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం అకాల వర్షాలు అక్కడక్కడ పడుతుండడంతో రైతులు విత్తనాలకు తీసుకొని పొలాల్లో చల్లుకోకూడదని విజ్ఞప్తి చేశారు. విత్తనాలు నాటే ముందు సలహాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జనుము విత్తనాలు పంపిణీ



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఖరీఫ్ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై జనుము విత్తనాలు రైతులకు అందజేసినట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య పేర్కొన్నారు న్యాల్‌కల్ లో డీసీఎంఎస్ కేంద్రంలో పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు చూపించి 40 కేజీల బస్తా ధర రూ. 1448 చెల్లించి తీసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో విత్తనాలు తీసుకునేదుకు రైతులు ఆసక్తి చూపారు మంగళవారం కూడా పంపిణీ కొనసాగుతుందని వ్యవసాయ అధికారులు అన్నారు పంపిణీ కార్యక్రమం లో మండల ఏవో లావణ్య , వ్యవసాయ విస్తీర్ణ అధికారులు షరీఫ్ , సాయిలు ఆయా గ్రామాల రైతులు ఉన్నారు. ఖరీఫ్ సాగుకు సబ్సిడీపై సోయాబీన్ విత్తనాలు కూడా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చెత్తకుప్పలతో దుర్వాసన







నవతెలంగాణ - ఝరాసంగం

నివాస గృహాలకు దగ్గరగా ఉన్న చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్వాసన, పొగ వల్ల ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నామని ఝరాసంగం గ్రామంలోని 1వ వార్డు ప్రజలు శివ తదితరులు నవతెలంగాణ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కక్కర్వాడ గ్రామాన్ని వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్తను పారవేయడం,అలాగే కేతకీ అలయని వచ్చే భక్తులకు సంబంధించిన చెత్తను సైతం రోడ్డు పక్కనే వేయడంతో దుర్వాసన అధికమవుతుందనీ వాపోయారు.పైగా అడపా దడపా వర్షాలు కురవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయనీ పేర్కొన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందనీ,పైగా దోమల బెడద ఎక్కువై డెంగ్యూ బారిన పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ ను కూడా చల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పలుమార్లు అధికారులకు విన్నవించినా పటించుకోడం లేదని వాపోయారు.అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ తల్లికి బోనాల సమర్పణ





నవతెలంగాణ-పుల్కల్: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పోచమ్మ తల్లి ద్వితీయ మహోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు బోనాలను తయారుచేసి పోచమ్మ దేవస్థానంలోని పోచమ్మ తల్లి సమర్పించారు. పోచమ్మ తల్లి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. గ్రామస్తులు అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని, పచ్చని పంటలతో కళకళలాడాలని అమ్మవారిని వేడుకున్నారు ఈ ఉత్సవాలలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

• మండల వ్యవసాయ అధికారి విజయ రత్న

నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండల రైతులకు వానాకాలం పంటల సాగు కొరకు పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని అందోల్ మండల వ్యవసాయ అధికారి విజయ రత్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.30కేజీల జీలుగా రూ. 2790 ఉండగా ,సబ్సిడీ రూపములో రూ. 1116 చెల్లించాల్సి ఉంటుందని, 40 కేజీ ల జనుములు రూ. 3620 ఉండగా సబ్సిడీ రూపములో రూ. 1448 చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. మంగళవారం నుంచి రైతులకు ఏ ఆర్ ఎస్ కె -1 రైతు సేవ కేంద్రం లో అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ - న్యాల్‌కల్

మండలంలో 33 కె.వి విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని 7 సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో నేడు(మంగళవారం) ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు విద్యుత్తు నిలిపివేతకు మండల ప్రజలు వ్యాపారులు సహకరించాలన్నారు

కుటుంబ కలహాలు, అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-కల్హేర్

కుటుంబ కలహాలు, అనారోగ్యంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగ్‌దార్ గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. కల్హేర్ ఎస్సై వెంకటేశం కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలంలోని నాగ్‌దార్ గ్రామానికి చెందిన పస్నీర్ అశోక్ (25) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ కలహాలను ఎదుర్కొంటున్నారు. ఆదివారం రాత్రి భార్య పిల్లలతో కలిసి భోజనం చేసి పిల్లలతో కలిసి నిద్రించారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున అకస్మాత్తుగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని తగలబెట్టుకున్నాడు. అది గమనించిన అతని తల్లి భార్య మంటలను ఆర్పారు. కాలిన గాయాలతో విలవిలలాడుతున్న అశోక్‌ను చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించగా, మార్గమధ్యలోని అమీర్‌పేట వెల్నెస్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందినట్లు కల్హేర్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అశోక్ మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ అశోక్ తల్లి బీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసంఘటిత కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు

నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (సీనియర్ సివిల్ జడ్జ్) బి. రమేష్ సోమవారం సంగారెడ్డి పట్టణం నందు అసంఘటిత రంగ కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బి.రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు కనీస అర్హతలు 18 నుంచి 60 సంవత్సరాలు దాటినవారు ఉండాలన్నారు. గత 12 నెలలలో తక్కువ కాకుండా భవన లేదా ఇతర నిర్మాణ పనులలో నియమింపబడినట్లయినా అట్టి వ్యక్తి ఈ చట్టం కిందకు నమోదు చేసుకోనుటకు అర్హుడు అని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల ఇతర నిర్మాణ పనులలో అందించే పథకాలు వివాహ బహుమతి పథకం, ప్రసూతి లబ్ధి పథకం ప్రాణాంతక, ప్రమాదాల లబ్ధి పథకం, ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక



సహాయాన్ని అందించే పథకం సాధారణ మరణ లబ్ధి పథకం ప్రమాదాల వలన జరిగిన తాత్కాలిక వైకల్యంనకు సహాయం దహన సంస్కారాల ఖర్చుల చెల్లింపు పథకం, వృత్తి శిక్షణ జాతీయ పెన్షన్ పథకం నమోదు చేసుకొని కార్మికుల వారసులకు ఆర్థిక సహాయం పథకం రాష్ట్రీయ సంస్థ బీమా యోజన పథకం అందిస్తున్నారని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కొరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని అని అన్నారు. కార్మికులు ఎవరైనా తమకు ఈ సంక్షేమ పథకాలు అమలులో గాని లబ్ధిలో గాని ఏమైనా ఇబ్బందులకు అన్యాయాలకు గురైనట్లు భావించిన లేదా వారి యొక్క సంక్షేమ పథకాల ఏవైనా అపరిస్కృతంగా ఉన్నా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యాదయ్య, భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, కార్మికులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని కిసాన్ మోర్చా ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి

అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేసి అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా లో అకాల వర్షాల వల్ల వరి ధాన్యం తడిసిపోయిన కారణంగా ప్రభుత్వ యంత్రాంగం రైతులకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ఐకెపి సెంటర్లో కొనుగోలు చేయాలని కోరారు. వడ్లల్లో తేమశాతం 15, 17 కాకుండా 20 శాతంగా కొనుగోలు చేయాలి అని అన్నారు. గత పది సంవత్సరాల నుండి రైతుల దగ్గర నుండి హమాలీ డబ్బులు తీసుకున్నారని అన్నారు.అందులో సగం ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న డబ్బులు ను వెంటనే రైతులకు నగదు గాని బ్యాంకుల్లో గాని చెల్లించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు దేశ్పాండే,జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజ గౌడ్, బిజెపి ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు, మున్సిపల్



కౌన్సిలర్లు మందుల నాగరాజ్ ,కసిని వాసు జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయ్ కుమార్ ,మీనా గౌడ్, శ్రీశైలం, బిక్షపతి ,కిసాన్ మోర్చా నాయకులు నాగరాజు, దశరథ్ ,చల్లా ప్రభాకర్ రెడ్డి, విశ్వనాథ్ ,లింగమూర్తి ,కిసాన్ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలేబుల్ స్కూల్‌లో ప్రవేశం కొరకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సంగారెడ్డి: 2024-2025 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలేబుల్ స్కూల్ కింద సంగారెడ్డి జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుండి 3,5,8వ తరగతులలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తరగతిలో (23 సీట్లు), 5వ తరగతిలో (11 సీట్లు) 8వ తరగతిలో (11 సీట్లు) ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు ఫారాలు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్, సంగారెడ్డి నందు పొందగలరు అని అన్నారు. పాఠశాల లో ప్రవేశం కొరకు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.1,50,000/- లు, మున్సిపాలిటి పరిధిలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ. 2,00,000/- లలోపు ఉండాలి అని అన్నారు. దీనితోపాటు మీ సేవ నుండి పొందిన కులము, ఆదాయము, నివాసము సర్టిఫికెట్స్, పుట్టిన తేది దవీకరణ పత్రము (మున్సిపల్ కార్పోరేషన్ లేదా. ఎమ్మార్వో/తహసిల్దార్), రేషన్ కార్డ్, ఆధర్ కార్డ్, గత సంవత్సరం పూర్తిచేసిన తరగతి బోనఫైడ్ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పని సరిగా జతపర్చవలెను. లేనిచో దరఖాస్తులు స్వీకరించబడదని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించు చివరి తేది. 06.06.2024 సాయంత్రం 5.00 గంటలలోపు మాత్రమే అని అన్నారు.స్వీకరించిన దరఖాస్తులు తేది. 12.06.2024 రోజున ఉదయము 11.00 గంటలకు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్, సంగారెడ్డి నందు లాటరీ పద్ధతిన డ్రా తీసి విద్యార్థుల ఎంపిక నిర్వహించబడుతుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా (సెలక్షన్ లిస్టు) జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయము సంగారెడ్డి జిల్లా నందు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు మొదటి దఫా 18.06.2024 , రెండో దఫా 24.06.2024 తేదిలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

టేకులకుంట కట్ట ధ్వంసం



నవతెలంగాణ - జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని ఊట్ల గ్రామ శివారులో గల టేకులకుంట కట్టను కొందరు అక్రమార్కుల ధ్వంసం చేశారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు భూ బకాసురులు అక్రమ వెంచర్ వ్యవహారంలో భాగంగా ఈ చర్యకు పాల్పడి ఉంటారని ఊట్ల గ్రామస్తులు, మత్స్య సంఘం ప్రతినిధులు మండిపడ్డారు. ఇటీవల ఊట్ల గ్రామానికి సంబంధించిన టేకుల కుంటలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కట్ట పనులు ఉపాధి హామీ కూలీలు చేపట్టారని స్థానికులు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద తాము చేపట్టిన పనికి డబ్బులు కూడా రాలేదని, ఈ లోపులోనే కుంట కట్టను అక్రమార్కులు ధ్వంసం చేయడం ఏమిటంటూ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మత్స్య శాఖ సంఘం ప్రతినిధులు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ ఇరిగేషన్ విభాగం డి ఈ రామస్వామి, స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులందరూ టేకులకుంట కట్ట ధ్వంసమైన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే జెసిబి తో టేకులకుంట కట్టను ధ్వంసం చేసిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. టేకులకుంట కట్టను ధ్వంసం చేసిన అక్రమార్కులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఓట్ల గ్రామస్తులు మత్స్య శాఖ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలులో లారీల కొరత తీర్చాలి

• నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి
• తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం చేసి కొనుగోలు చేయాలి
• సిపిఎం ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్

నవతెలంగాణ- జోగిపేట

యాసంగి పంట చేతికి వచ్చి రెండు నెలలు అవుతున్నా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు పూర్తి చేయలేదని సిపిఎం ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి .విద్యాసాగర్ అన్నారు. సోమవారం జోగిపేటలో ఆర్డీవో పాండుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి లారీలను పంపకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని, లారీల కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, తక్షణమే కాంటాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లారీలు లేక తూకం వేసిన ధాన్యం సెంటర్ల వద్దే నెలల తరబడి ఉందని, అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారని వర్షాకాలం పంటలు వేసే సమయానికి కూడా కొనుగోలు పూర్తి కాకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు చివరికి కన్నీరే మిగులుతుందని అన్నారు. సకాలంలో తూకం చేయకపోవడంతో కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధిక తేమ, తాలు పేరిట తరుగుతీస్తున్న రైస్ మిల్లర్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వీరేశం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

• బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మైపాల్ రెడ్డి

నవతెలంగాణ -సిద్దిపేట కలెక్టరేట్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ హామీ అమలు చేయాల్సిందేనని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్ రెడ్డి కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో ఏవో రహిమాన్‌కు వారు సోమవారం వినతిపత్రం ఇచ్చినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ కల్లాల మీద ఉన్న వడ్ల కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆరోపించారు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు .కార్యక్రమంలో కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజు ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి,కృష్ణ కార్యదర్శులు మర్కంటి ఎగొండ, అజిత్ యాదవ్, కర్నాల నర్సింలు సోషల్ మీడియా కన్వీనర్ లంబ



నాగరాజు, మద్దుల యాదవ రెడ్డి,రాజు,పంజా బాలయ్య, పూల కరుణాకర్, రాజిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్‌లోని మూడు సంవత్సర ఇంజనీరింగ్ , నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుతో పాటుగా , వ్యవసాయ డిప్లొమా, వెటర్నిటీ డిప్లొమా ప్రవేశం కోసం ఈ నెల 24 న జరిగే పాలీసెట్ -2024 నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సంగారెడ్డి సమన్వయకర్త, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ . ఎం. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , పరీక్ష నిర్వహణకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో 2420 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పాలీసెట్-2024కు సంగారెడ్డి పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష సమయం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది అని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9.30 లోపు చేరుకోవాలని సూచించారు. 10.00 గంటల నుంచి అనుమతిస్తామన్నారు. 11.00 గంటల తరువాత నిముషం ఆలస్యమైన అనుమతి ఉండదని స్పష్టం చేశారు. డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ పై ఫోటో ప్రింట్ కాని వారు పాస్ పోర్ట్ సైజు ఫోటో అతికించుకొని ఎవరైనా గజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, హెచ్ బి పెన్సిల్, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్, ఎరేజర్ తెచ్చుకోవాలని కోరారు. పరీక్ష మధ్యలో టాయిలెట్ కు అనుమతించరు అని వెల్లడించారు.

కార్యకర్త కుటుంబానికి అండగా బీఆర్ఎస్ పార్టీ



నవతెలంగాణ-కొండపాక

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు. కుకునూర్ పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త వేణు మాధవ్ గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతనికి పార్టీలో సభ్యత్వం ఉండడం వలన ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్‌ని పార్టీ శ్రేణులతో కలిసి అతని భార్య పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసి ఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, రాగల దుర్గయ్య, కోల సద్గుణ, సంపత్, కోడెల మల్లేశం పాల్గొన్నారు.

సబ్సిడీతో జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో సబ్సిడీతో జీలుగా, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గీత, విస్తరణ అధికారి సాయి వర్మ తెలిపారు. సోమవారం నంగునూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు 60 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తుందని మిగతా 40 శాతం చెల్లించి రైతులు తీసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసే మొక్క చుట్టూ పచ్చి రొట్ట విత్తనాలను చల్లాలన్నారు. ఆయిల్ పామ్ మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు కలుపును నివారించడంలో తోడ్పడుతుందన్నారు. జీలుగా 30 కిలోలు రూ. 1116, జనుము 40 కిలోలు రూ. 1448 లు చెల్లించాలన్నారు. పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలని కోరారు. వరి, ఆయిల్ పామ్ పంటలను సాగుచెసే రైతులు పచ్చి రొట్ట పంటలను వేసుకోవాలని సూచించారు.

సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆర్డీఓను కోరిన ఏఐఎస్ఏఫ్ జిల్లాధ్యక్షుడు సంగెం మధు

నవతెలంగాణ-బెజ్జంకి



విద్యార్థుల ప్రవేశాలకు అయా ధృవీకరణ పత్రాలందజేసే సమయంలో రెవెన్యూ శాఖ సిబ్బంది సమయపాలన పాటించడం లేదంటూ ఏఐఎస్ఏఫ్ జిల్లాధ్యక్షుడు సంగెం మధు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఏఐఎస్ఏఫ్ నాయకులు సందర్శించి సిబ్బంది సమయపాలనను పరిశీలించారు. ఉదయం10.50ని. దాటినా సిబ్బంది హాజరవడం లేదని మధు వాపోయారు. మండలంలోని రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించక ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆర్డీఓ తక్షణమే శాఖపరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఏఫ్ అధ్వర్యంలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని మధు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొంతరవేణి మహేశ్, చరణ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణ పరిధి 3వ వార్డులోని ఎస్సీ కాలనీలోని పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఐరేణి రాజ్ కుమార్, కోశాధికారి దబ్బెట తిరుపతిలు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో చేపట్టిన ఛాంబర్‌ల నుంచి మురికి నీరు రోడ్డుపై పారుతుందన్నాడు. కాలనీ వాసులకు దుర్వాసన వస్తుందన్నారు. దోమలు, ఈగల ఇబ్బందులు కూడా ఎక్కువయ్యాయన్నారు. దోమలు, ఈగల వలన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విషపు జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారు దబ్బెట శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుండె పోటుతో టైలర్ మృతి

నవతెలంగాణ-చేర్యాల

పట్టణానికి చెందిన కొనెక్స్ టైలర్ యజమాని గోరంతల అంజనేయులు (68) ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో కన్ను మూశారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు సోమవారం పట్టణంలోని ఆయన నివాసం వద్ద మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాల నుంచి టైలర్ వృత్తిలో రాణిస్తూ ఎంతో మందికి టైలర్ పనిని నేర్పించారని, టైలర్ పనితో పాటు కుట్టు మిషన్ రిపేర్‌లో నైపుణ్యం కలిగిన వ్యక్తి అని, చేర్యాల పట్టణంతో పాటు వివిధ మండలాలు గ్రామాల నుంచి వచ్చే కస్టమర్లకు అనేక సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడని తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు ముస్త్యాల బాల నర్సయ్య, సీపీఐ నాయకులు అందె అశోక్, ఈరి భూమయ్య, బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షులు శివగారి అంజయ్య, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తార యాదగిరి, పచ్చి మడ్ల సతీష్, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం కోసం ప్రచారం

నవతెలంగాణ-చేర్యాల



వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం పట్టణంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి-శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీష్,పార్టీ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్, నాయకులు పాకనాటి భాస్కర్, అవుశెర్ల వెంకటేష్, కక్కర్ల నరేష్, రావుల గణేష్, అవుశెర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్‌లు పెంచాలి

- బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్ యాదవ్



నవతెలంగాణ-గజ్వేల్ 10

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీల రిజర్వేషన్లను 20 శాతం నుండి 42శాతం వరకు పెంచిన తర్వాతనే ఎన్నికల్లు నిర్వహించాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ యాదవ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామన్నారు. కుల గణన జరగకుండా బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఏ విధంగా స్థానిక సంస్థల ఎన్నికలు జూన్ నెలాఖరులో జరుపుతారని ప్రభుత్వాని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అన్ని రాష్ట్రాలలో కుల గణన జరిపి రిజర్వేషన్లను పెంచాకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వాగ్దానాన్ని తుంగలో తొక్కి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధపడడం ఆశ్చర్యకరంగా ఉందని ధ్వజమెత్తారు. బీసీలకు హామీ ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు తీర్పు తెలవదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలంటే బీసీల లెక్కలు తీయండి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లను పెంచితే సుప్రీంకోర్టు తీర్పును అధిగమించవచ్చున్నారు. అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై అన్ని పార్టీలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లలో సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపటం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే బీసీల లెక్కలు జరిపి రిజర్వేషన్లు పెంచినాకే స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని అరుణ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దేవుడి విగ్రహం జాడ ఎక్కడ?

- చోరీకి గురైన అతి పురాతన విగ్రహం
- రెండు సంవత్సరాలైనా ఇంకా దొరకని దొంగలు
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-వర్గల్



వర్గల్ మండల కేంద్రం ఆధ్యాత్మిక ఆలయాలకు నిలయం. వర్గల్ గ్రామంలో సుమారు 800 సంవత్సరాల చరిత్రగల అద్భుతమైన కట్టడంతో దేవాలయం ఉన్నది. ఈ దేవాలయంలో శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణు గోపాల స్వామి వారు కొలువుతీరి ఉన్నారు. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున స్వామి వారికి బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను చుట్టుపక్కల ఉన్న 30 గ్రామాలు ప్రజలు పండగల నిర్వహిస్తారు. వేణుగోపాల స్వామి వారిని ఎంతో మహిమగల దేవుడిగా ప్రజలు కొలుస్తుంటారు. ఈ ఆలయం వలన సుమారుగా 800 సంవత్సరాల చరిత్ర ఆనవాళ్లు వర్గల్‌లో కనిపిస్తాయి. రాతి కట్టడంతో ఆలయం నిమించబడి ఉన్నది. ఎత్తైన గాలిగోపురం, ఎత్తైన విమాన రథం, అలాగే రథశాల ఉన్నది. స్వామివారి



ముందు రాతి కట్టడంతో ఉన్న పెద్ద కోనేరు ఉంటుంది. ఆలయం ఆవరణలో ఇతర కొన్ని కట్టడాలు ఉన్నపటికీ అవి కాలక్రమేనా కాలగర్భంలో కలిసిపోయాయి. ఇంత గొప్ప చరిత్ర కలిగిన పురాతన ఆలయంలో గత రెండు సంవత్సరాల క్రితం స్వామివారి పురాతన విగ్రహం చోరీకి గురైంది! 2022 అక్టోబర్ నెలలో స్వామివారి విగ్రహం కనిపించకుండా పోవడంతో మండల వ్యాప్తంగా ప్రజలు, స్వామివారి భక్తులు, దిగ్భ్రాంతి చెందారు. స్వామివారి విగ్రహం అపహరణకు గురైన తరువాత పోలీసులు ఆలయంలోకి వచ్చి ప్రాథమిక విచారణ చేపట్టారు. స్పెషల్ క్యూస్ టీమ్‌తో ఆలయంలో పలు రకాల నమూనాలను సేకరించి దర్యాప్తు నిర్వహించారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు విగ్రహానికి సంబంధించి ఎలాంటి సమాచారం లభించలేదు. ఇంత టెక్నాలజీ ఉన్న రోజుల్లో కూడా స్వామివారి అతి పురాతనమైన విగ్రహం చోరీకి గురై ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు, సమాచారం లభించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చోరీ జరిగిన సమయంలో గజ్వెల్ నియోజికవర్గానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మండలంలో గ్రామం నడిబొడ్డున ఉన్న ఆలయంలో చోరీ జరగడం,



ఇప్పటివరకు విగ్రహ జాడ లభించకపోలవడం అంత ఒక మిస్టరీలా మారింది. స్వామివారి విగ్రహ మిస్టరీ ఛేదించడానికి ఇంకా ఎన్నిరోజులు పడుతుందో..? తెలియాల్సి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా పూజలు అందుకున్న స్వామి వారి విగ్రహం కనిపించకుండా పోవడంతో భక్తుల్లో ఏదో నిరాశ ఆవరించింది. విగ్రహం మిస్టరీ అలా ఉండగా 2024 మే 21 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.



పురాతన విగ్రహం లేకుండానే ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

రైతు హామీలను అమలు చేయాలి

- తహసీల్దార్ వద్ద బైఠాయించి బీజేపీ శ్రేణుల ఆందోళన
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర పప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాల్ రూ.500 బోనస్, రైతు భరోసాలో ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేలు, ఆకాల వర్షాల వల్ల నష్టపోయిన పంట నష్టపరిహారం హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు అధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలతో పాటు నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి బీజేపీ శ్రేణులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొలిపాక రాజు మాట్లాడుతూ ఖరీఫ్ కాలం ముంచుకొస్తుండడంతో రైతులు పెట్టుబడులకు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ అమలులో నిర్లక్ష్యం చూపడంతో బ్యాంకులు మళ్లీ రుణాలు అందించే పరిస్థితులేవన్నారు. త్వరితగతిన పెట్టుబడి సాయం అందజేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని



కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని, ఎలాంటి అంక్షలేకుండా ప్రభుత్వం కొనుగోళ్లు చేయాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు సంగ రవి, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు బామండ్ల జ్యోతి, నాయకులు కచ్చు సంపత్, కొత్తపేట రామచంద్రం, బండిపల్లి సునీత, గంప రవికుమార్, ఒగ్గు కనకయ్య, బుర్ర కిషన్, గొడుగు సంపత్, మంగలరాపు వేణు ఎల్లం, నేతి మహేష్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి
- ఎఫ్‌డి సమాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-కొండపాక

అకాల వర్షాల వల్ల తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో వర్షానికి తడిసి మొలకెత్తిన వరి ధాన్యాన్ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వారి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వరి ధాన్యానికి అని చెప్పడం దారుణమన్నారు. జిల్లాలో తడిసిన వారి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో వచ్చే నెల 5వ తేదీన రాజీవ్ రహదారి దిగ్బంధించి వంటా వార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు దేవి రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నూనె కుమార్



యాదవ్, రాగల దుర్గయ్య, అనంతుల ప్రశాంత్, కోల సద్గుణ, సర్పంచ్ మల్లమారి రవీందర్, కోడెల మల్లేశం, శ్రీనివాస్ గౌడ్, కనక సేన, సున్నం భాస్కర్, బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

దళితుల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలి

- డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి విజయ్‌కుమార్

నవతెలంగాణ-మిరుదొడ్డి

దళితుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం లింగుపల్లి గ్రామంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జరిగిన డిబిఎఫ్ కార్యకర్తల సమావేశంలో వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హమీల అమలుకు ఒత్తిడి తీసుకరావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటిలలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవర్చాలన్నారు. అంబేద్కర్ భరోసా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి చట్టం కింద నిధులను ఖర్చు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులలో పోలీసుల నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. త్వరలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించి దళితుల అభివృద్ధిపై



చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, శివ కుమార్ బాల్ నర్సింలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస వాటర్ ప్లాంట్లకు ఎన్నికలు నిర్వహించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని బాలవికాస వాటర్ ప్లాంటులకు ఎన్నికలు జరపాలని సోమవారం స్థానిక నాయకులు మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితం మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య హయాంలో ఎన్నికలు జరిగాయన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికలు పెట్టడం లేదన్నారు. ప్రతి యేటా సభ్యుల సమక్షంలో ఆర్థిక లాభ నష్టాలు చూడాల్సి ఉన్నప్పటికీ అవివే పట్టించుకోవడం లేదన్నారు. పదేళ్ల గడిచిన లెక్కలు, ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బాలవికాస వాటర్ ప్లాంట్ సంస్థ మున్సిపల్ సంబంధించిన భూములు, భవనాలలో ఎటువంటి పన్నులు చెల్లించకుండా వాడుకుంటున్నారన్నారు. ఇటీవల కొన్ని వాటర్ ప్లాంట్‌లు లాభాలలో ఉన్న బంధు చేశారని , పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ఎందుకు మూసివేశారో ప్రజలకు చెప్పాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం



నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, వరియోగుల అనంత స్వామి, వెళ్దండి సంతోష్, గాదాస్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ సాగు.. ఫలితాలు బాగు

- అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు
- సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయధికారి స్వేతకుమారి

నవతెలంగాణ- కొల్చారం

రైతులు జీలుగ సాగు చేస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతులు మట్టిని వేసే బదులు నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్టె ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చున్నారు. అందుకోసం రైతులు అందుబాటులో ఉన్న జీలుగ, జనుము విత్తనాలను సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచిస్తున్నారు. నేల స్వభావాన్ని బట్టి జీలుగను సాగు చేసుకుంటే తర్వాత వేసే పంటలకు అనుకూలంగా ఉంటుందని, పచ్చిరొట్టె ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలో కలియదున్నడంతో అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన పోషకాలు అందిస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను



మండలంలోని ఆయా ఆగ్రో సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం పంటల్లో అధిక దిగుబడి రావాలనే ఉద్దేశంతో ఈ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నది. అందుకోసమే జీలుగ, జనుము విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏకవార్షిక మొక్కల్లో ప్రథమస్థానం జీలుగదే. మొక్కలు నాటిన 30 నుంచి 35 రోజుల్లోనే ఏపుగా పెరుగుతాయి. దుక్కిలో 30 కిలోల యూరియా వేసిన తర్వాత ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో ఉండే విధంగా చూడాలి. జీలుగను సాగు చేసిన తర్వాత 30 రోజుల్లో ఏపుగా పెరిగి పూతదశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి. లేనిచో రొటోవేటర్ సాయంతో పొలం అంతా కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ పాస్ఫేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్టె ఎరువుగా తయారవుతుంది. చివరి వరకు పొలంలో జీలుగ కుళ్లేదశలో నీటిని సక్రమంగా అందించాలి. జీలుగ 30కిలోల బ్యాగును రూ.1116, జనుము 40కిలోల బ్యాగును రూ.1448 సబ్సిడీకి ప్రభుత్వం విక్రయిస్తుంది.

జీలుగతో లాభాలు

పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, తర్వాత వేసే పంటలకు విశేషమైన లాభాలు అందిస్తుంది. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది. జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్టె ఎరువు లభిస్తుంది. మొక్కలకు 2శాతం నత్రజని, సూపర్ పాస్ఫేట్‌ను అదనంగా అందిస్తాయి. జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయి. నేలపై కరగని మూలకాలను పంటకు అనుకులంగా మార్చుతాయి. అంతేకాకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికంగా పెంచుతుంది. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. లెగ్యూజాతికి చెందిన మొక్కకావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.



తుంగ, గెరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుంది.

అందుబాటులో సబ్సిడీపై జీలుగ విత్తనాలు

- స్వేతాకుమారి, మండల వ్యవసాయధికారి, కొల్చారం



జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైతుకు 30 కిలోల విత్తనాలను అందజేయడం జరుగుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే ఈ విత్తనాలను రైతులు సకాలంలో తీసుకొని వేసుకోవాలి. విత్తనాలను ఆగ్రో సేవా కేంద్రాల్లో విక్రయిస్తున్నాం.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ -సిద్దిపేట కలెక్టరేట్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 24 నుండి జూన్ 3వ తేది వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ జరుగుతుంది. మొదటి సంవత్సరం పరీక్ష సమయం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30 నిమిషాల నుండి సాయంత్రం 5:30 నిమిషాల వరకు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, పరీక్షలను సజావుగా జరిగేలా చూడాలని అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 9981 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఇందులో ప్రథమ సంవత్సరం 5711, ద్వితీయ సంవత్సరం 4270 మంది విద్యార్థులు పరీక్ష రాయలనీ పేర్కొన్నారు జిల్లాలో 27 సెంటర్లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్, అడిషనల్ డిసిపి(ఎఆర్) రాం చందర్ రావు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల వితరణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ సోమవారం జెర్సీల వితరణ చేశారు.క్రీడాకారులకు తోడ్పాటును అందించాలనే సదుద్దేశంతో తన వంతుగా జెర్సీల అందజేసినట్టు శ్రీకాంత్ తెలిపారు.జెర్సీల వితరణ చేసిన శ్రీకాంత్ కు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

అలసత్వమా?...నిర్లక్ష్యమా?...

- అసంపూర్తిగా మన ఊరు-మన బడి పనులు
- గత ఆరు నెలలుగా ముందుకు సాగని వైనం
- ఎమ్మెల్యే శ్రద్ధ వహిస్తేనే పనుల పురోగతి

నవతెలంగాణ-బెజ్జంకి

పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ కు దీటుగా విద్యనందించాలనే గొప్ప సంకల్పంతో ఆగస్టు,2022లో ప్రభుత్వం మన ఊరు-మన బడి ప్రణాళికతో బృహత్తర కార్యక్రమం ప్రారంభించింది. మండలంలో సుమారు 12 పాఠశాలలను ఎంపిక చేశారు.మొదటి విడతలో బెజ్జంకి,గుండారం, బేగంపేట,కల్లేపల్లి,రేగులపల్లి,గుగ్గీల్ల ప్రాథమిక,ఉన్నత పాఠశాలల్లో సుమారు రూ.5 కోట్ల నిధులతో మండలంలోని అయా పాఠశాలలో అదనపు తరగతి గదులు,కిచెన్ షెడ్, డైనింగ్ హాల్,మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణాలు, వైరింగ్,ఫ్లోరింగ్,మరమ్మత్తుల పనుల కోసం ప్రణాళికలు రూపొందించి మన ఊరు-మన బడి పనులు ప్రారంభించారు.గుండారం, బేగంపేటలో పనులు నేటికి అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి పాఠశాలలు విద్యార్థులకు అందుబాటులోకి రాని దుస్థితి నెలకొంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అసంపూర్తి పనులను పూర్తి చేయడానికి సంకల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ విద్యాలయాలను తలపిస్తాయి.

గుండారంలో...

ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణకు మన ఊరు-మన బడి ప్రణాళికలో సుమారు రూ.41.09 లక్షల అంచనా నిధులతో పనులు ప్రారంభించారు. సుమారు రూ.4.69 లక్షల నిధులతో చేపట్టిన పనులు పూర్తిచేసుకుని ఫిబ్రవరి 01,2023న అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు.సుమారు రూ.36.40 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ,వంట గది,భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.నేటికి శంకుస్థాపన చేసిన పనులు అసంపూర్తిగానే మిగిలాయి. ప్రభుత్వోన్నత పాఠశాలలో చేపట్టిన ప్రహరీ గోడ, భోజనశాల, వంటశాల, మూత్రశాలలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.





బేగంపేటలో...

సుమారు రూ.కోటి నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది.మరికొన్ని నిధుల కొరతతో పూర్తి స్థాయిలో పనులు నిలిచిపోయి అందుబాటులోకి రావడం లేదు. వంటగదులు,భోజన శాలలు,మూత్ర శాలలు అసంపూర్తిగానే మిగిలాయి.

రేగులపల్లిలో..

ప్రభుత్వోన్నత పాఠశాలలో చేపట్టిన పనులు పూర్తవ్వగా ప్రాథమిక పాఠశాలలో భోజనశాల,మూత్రశాలలు నిర్మాణానికి నోచుకోలేదు.మూత్ర శాఖల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమారు రూ.4 లక్షల నిధులు వెచ్చినట్టు సమాచారం.



కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి సౌకర్యాలు కల్పించి సకల హంగుతో తీర్చిదిద్ది పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ అధికార యంత్రాంగం భావిస్తూ మన ఊరు-మన బడి ప్రణాళికలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని అధికార యంత్రాంగం సంకల్పిస్తోంది.అధికార యంత్రాంగం సంకల్పం నిధలలేమి వల్ల నెరవేరే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు.పనులు చేపట్టిన గుత్తేదారులు బిల్లులు వస్తేనే నిర్మాణ పనులు చేపడుతామనే నిశ్చయంతో ఉన్నట్టు వినికిడి.మొదటి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు చేయదానికి గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు,అధికారులు గుత్తేదారులను ఒప్పించి పనులు చేయించారు.గత కొన్ని నెలలుగా మన ఊరు-మన బడి పనులు ముందుకు సాగ లేదు.నిర్మాణ పనులను వేగవంతం చేయడంలో అధికార యంత్రాంగ అలసత్వమా? చేసిన పనులకు బిల్లులు మంజూరీ చేయడంలో గత ప్రభుత్వం వ్యవహరించిన నిర్లక్ష్యమా?తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.పనులు పూర్తి చేసిన దశ వరకు బిల్లులను నమోదు చేశామని అధికారులు చెబుతుంటే..బిల్లులు చెల్లింపుల్లో అలసత్వం వల్లే పనులు చేపట్టడం లేదంటూ గుత్తేదారులు చెబుతున్నారు.మన ఊరు-మన బడి పనుల పురోగతికి ప్రభుత్వం నిధులు కేటయించేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే పనులు కాస్త ముందుకు సాగే పరిస్థితి ఉందని గుత్తేదారులు వాపోతున్నారు.

పనులు పూర్తి చేసుకుని వినియోగంలోకి..

సకల సౌకర్యాలతో,నూతన హంగులతో నిర్మాణం పూర్తి చేసుకున్న మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల,గుగ్గీల్ల,కల్లేపల్లి పాఠశాలలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చాయి.బాలికల ప్రభుత్వోన్నత పాఠశాలలో ప్రారంభించిన భోజనశాల వినియోగంలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పూర్తి చేసిన పనులకు బిల్లులు నమోదు చేశాం

మన ఊరు-మన బడి ప్రణాళికలో అయా గ్రామాల పాఠశాలల్లో చేపట్టిన పూర్తిచేసిన దశ వరకు పనుల బిల్లులను నమోదు చేశాం.ఎమైనా పనులు చేపట్టి పూర్తి చేసిన వాటిని మళ్లీ పరిశీలించి బిల్లులు నమోదు చేస్తాం.

వలస కూలీ అదృశ్యం



నవతెలంగాణ-కొండపాక

వలస కూలీ అదృశ్యం అయిన సంఘటన కుకునూరు పల్లి మండల పరిధిలోని మేదినీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దారే జిల్లా బాగ్ గ్రామానికి చెందిన బులియా సలాం, అతని భార్య పింకీతో కలిసి మెదినిపూర్ గ్రామ శివారులోని ఓ సిమెంట్ ఇటుకల పరిశ్రమలో కూలీలుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే ఈ నెల 15వ తేదీ రాత్రి భోజనం చేసి నిద్రించారు. మరుసటి రోజు ఉదయం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో సలాంకు మెలకువ వచ్చి చూసేసరికి అతని భార్య పింకీ కనిపించకపోవడంతో చుట్టుపక్కల తెలిసిన వారిని విచారించగా ఎక్కడ దొరకకపోవడంతో సోమవారం రోజున కునూరు పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు . బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్సీడీపై పచ్చిరొట్ట విత్తనాల ఎరువులు

నవతెలంగాణ-బెజ్జంకి

అధిక మోతాదు ఎరువుల నివారణకు, ఆశించిన పంట దిగుబడులకు రైతులు తమ వ్యవసాయ సాగు భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించాలని మండల వ్యవసాయశాఖ అధికారి సంతోష్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు.మండల కేంద్రంలోని అంగ్రోస్ రైతు సేవ కేంద్రం యందు పచ్చి రొట్ట ఎరువులు జీలుగ,జనుము సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు తమ పట్టా పాస్ బుక్,ఆధార్ కాపీలతో వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని సంతోష్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-తొగుట

విద్యుత్ మరమ్మతుల సందర్భంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాస్ రావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని 33 కెవి మెట్టు ఫీడర్ మరమ్మతుల సందర్భంగా మంగళవారం విద్యుత్ నిలిపి వేస్తున్నామని అన్నారు. మెట్టు, గుడికందుల, తడకపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి ఫీడర్లు ఉదయం 07:00 గంటల నుండి 10:00 గంటల వరకు కంపెనీలకు, వ్యవసాయ సంబంధిత ఫీడర్ పరిధిలోగల, బండారుపల్లి, మెట్టు, పెద్ద మసాన్ పల్లి, గణపూర్, గుడికందుల, లింగంపేట, తడక పల్లి గ్రామాల్లో అన్ని వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగ దారులకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. కావున ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ఆత్మీయ అనురాగాలు పంచుకున్న పూర్వ విద్యార్థులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆనందంగా గడిపారు.తమ స్నేహ బంధాలను గుర్తుకు తెచ్చుకుని సందడి చేశారు.మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి విద్యాలయంలో పదో తరగతి విద్యాభ్యాసం చేసిన 2003-2004 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వివిధ రంగాలు,ఉద్యోగాలలో స్థిరపడిన వారంతా 20 సంవత్సరాల తదుపరి ఒక్కచోట చేరారు. తమకు అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏ ఏ సబ్జెక్టు టీచర్లు ఎలా బోధించారో గుర్తు చేసుకున్నారు.నాడు బోధించిన సంస్కారమే నేడు సమాజంలో రాణిస్తున్నామంటూ ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్తు.సుజాత , ప్రధానోపాధ్యాయులు సత్తు, మహిపాల్ రెడ్డి, ర్యాకం మల్లేశం, మాలే రమేష్, ఆనంద్, వెంకటేష్, సంతోష్, శేఖర్, పూర్వ విద్యార్థులు సంతోషి, నవిత, శ్రీలత, సి ఎచ్ లావణ్య, ఎస్ .లావణ్య, పావని, స్వప్న, నాగరాజు, రాజు, రాజేశం, విజయ్,సాగర్, జనార్దన్ రెడ్డి , నరసింహ రెడ్డి, యాదగిరి, నరేష్ రెడ్డి,వెంకటేష్, సంపత్, షహిన్నా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేసిన కూరగాయల వర్తక సంఘం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ కు చెందిన శ్యామ్ ప్రసాద్ అధ్వర్యంలో కూరగాయల వర్తక సంఘం శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలకు సుమారు ఇరవై వేల రూపాయల విలువగల బీరువాను వితరణ చేశారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక చేతుల మీదుగా బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు డా.ఆకుల నరేశ్ బాబు, డా. మంద సాయినాథ్ రెడ్డి, డా. రాళ్ళబండి పద్మ జ్యోతి, దొంతి రమేశ్, వుప్పుల మధుసూదన్,ప్రధానాచార్య హరిణ పవన్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, సమాజం కోసం సేవ చేయడంలో ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని, కూరగాయల వర్తక సంఘం సేవా నిరతి ఇతరులకు ఆదర్శప్రాయమని కొనియాడారు.

జీలుగా వల్ల ఎన్నో లాభాలు



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని గణేష్ పల్లిలో గల రైతు ఆగ్రోస్ సేవ కేంద్రంలో జీలుగు విత్తనాలు రాయితీ అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగు వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుందన్నారు.. 60 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం, 50 కిలోల పోటాష్ భూమిలో కలుస్తుందని, జీలుగు వేసుకోవడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది , జీవ రసాయనిక చర్యల వలన నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుకుంటుందన్నారు. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడతాయన్నారు. కలుపు మొక్కలు పెరగకుండా నివారించ వచ్చని, చౌడు భూముల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడతా యన్నారు.జీలుగా విత్తనాలు ఎకరానికి 12 నుండి 15 కిలోల విత్తనం అవసమని తెలియజేశారు.

ఇందిరా పార్క్ సుందరీకరణ ఇప్పట్లో లేనట్లేనా?

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం కేంద్రంలో ఉన్న ప్రధాన కూడలి చరిత్ర కలిగిన కూడలి ఇంద్ర పార్క్ సుందరీకరణ పనులు సంవత్సరం కాలంగా ముందుకు సాగడం లేదు. దీంతో స్థానికులు ఇంద్ర పార్క్ సుందరీకరణ పనులు ఇప్పట్లో లేనట్లేనని చర్చించుకుంటున్నారు. గజ్వేల్ పట్టణంలో ఇంద్ర పార్క్ చౌరస్తా సుందరీకరణ పనులు ఆటకెక్కినట్లు కనిపిస్తుంది. ఏడాది కాలంగా మున్సిపల్ పాలకవర్గం, ట్రాఫిక్ పోలీసులు పరిశీలనతోనే కాలయాపన కొనసాగుతుంది. స్థానిక ఇంద్ర పార్క్ చౌరస్తా వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. గతంలోనే మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, ట్రాఫిక్ పోలీసులు, ఏసిపి అధికారులు పలుసార్లు పర్యవేక్షణ చేసి ఇందిరా పార్క్ సర్కిల్ చౌరస్తాను ఎలా సుందరీకరణ చేయాలనేది చర్చించారు. కానీ ఇప్పటివరకు అమలు కావడం లేదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బంది చాలా వరకు వస్తున్నాయి. ఇంద్ర పార్క్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణలకు రూ. 50 లక్షల నిధులను కేటాయించారు. ఇందులో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ పనులు పూర్తయి ఏడాది కావస్తుంది. ఇంద్ర పార్క్ చౌరస్తా పనులు మాత్రం విస్తరణకు నోచుకోవడం లేదు. రోజురోజుకు పట్టణ విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో రోజుకు 50 వేలమంది రోజుకు రాకపోకలు సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వ్యాపారం నిమిత్తంతోపాటు ఇతర పనులపై గజ్వేల్ పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు 25 వేల మంది వరకు గజ్వేల్ పట్టడానికి విద్యాభ్యాసానికి వస్తున్నారు. గతంలో రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండడంతో దేశ రాష్ట్ర ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగించారు. అదే తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర మంత్రులు గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంపై దృష్టి పెట్టి పర్యటనలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వరకు రోడ్డు డివైడర్ విస్తరణ పూర్తయినప్పటికీ ఇంద్ర పార్క్ చౌరస్తా పనులు నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇంద్ర పార్క్ చౌరస్తా విస్తరించాలంటే పక్కకు ఉన్న భవనాలను కొంత తొలగించాల్సిన అవసరం ఉంటుందని అధికారులు, మున్సిపల్ పాలకవర్గం భావిస్తుంది. చౌరస్తా విస్తరించాలని స్థానికులు కోరుతున్నప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. చౌరస్తాలో ఇందిరా గాంధీ విగ్రహం ఉండటం వల్ల స్థానిక కాంగ్రెస్ నాయకులతో కూడా చర్చించాల్సిన అవసరం ఉంటుంది. చౌరస్తా విస్తరించినా అందులోనే ఇందిరమ్మ విగ్రహం ఉండాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ సంబంధిత శాఖ అధికారులకు ఇప్పటికే సూచించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి సుందరీకరణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి

గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా, ఇంద్ర పార్క్ చౌరస్తా సుందరీకరణకు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయగా ఇందులో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఇంద్ర పార్క్ చౌరస్తా సుంద్రీకరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. సంబంధిత ఏజెన్సీని పిలిపించి మాట్లాడుతామన్నారు. ఎన్నికల సందర్భంగా పనులు ప్రారంభించలేకపోయినట్లు చెప్పారు. కొన్ని బిల్లులు కూడా పెండింగ్లో ఉన్నాయి. పార్క్ పనులు చేపట్టే దశలో ప్రజలు సహకరించవలసిన అవసరం ఉంటుందన్నారు.

దేశంలో మేమే అధికారంలోకి వస్తున్నాం

- టిపిసిసి ఇంటలెక్చువల్ చైర్మెన్ అనంతుల శ్యామ్ మోహన్

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ 260-270 సీట్లతో దేశంలో అధికారంలోకి వస్తుందని, తాను జోస్యం చెప్పడం లేదని, వివిధ రాష్ట్రాల మేధావులతో మాట్లాడిన తర్వాతనే చెబుతున్నానని టిపిసిసి ఇంటలెక్చువల్ చైర్మెన్, క్రమశిక్షణ సంఘం మెంబర్ అనంతుల శ్యామ్ మోహన్ అన్నారు. సోమవారం హరిత హెూటల్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన పాదయాత్ర ప్రజలలో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 నుండి 12 ఎంపీ స్థానాలు గెలవనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీకి మంచి స్పందన వచ్చిందన్నారు. ఫలితాల అనంతరం దేశంలో పాలనలో మార్పులు వస్తాయన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన బాగుందని, తమ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలో 100 శాతం అమలవుతాయని అన్నారు. ప్రతిపక్ష నాయకులు వ్యవధి ఇవ్వకుండానే గ్యారెంటీలు అమలు చేయాలని సంస్కారం, సభ్యత లేకుండా మాట్లాడుతున్నారని, మాపై రాళ్ల వేయడం తగదన్నారు. జిల్లా కలెక్టర్ మంచి పని వంతుడు ఉన్నాడని, ఆయనను మొదటిసారి కలిసినట్లు తెలిపారు. కొండపాక మండలం, కొండపాక గ్రామ ప్రజల అభివృద్ధి గురించి ఆయనతో మాట్లాడినట్లు తెలిపారు. గ్రామానికి కష్టం, ప్రజలకు నష్టం రాకుండా ఆలోచించాలని, మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కలెక్టర్ తో చర్చించినట్లు తెలిపారు. కొండపాకలో ఉన్న రుద్రేశ్వర ఆలయాన్ని కలెక్టర్‌ను సందర్శించాలని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మార్క సతీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట - సిరిసిల్ల రైల్వే లైను భూసేకరణ వేగవంతం చేయాలి


- సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్


నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట నుంచి సిరిసిల్లకు రైల్వే లైన్ కోసం జిల్లాలోని చిన్నకోడూరు, నారాయణరావు పేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ ను వేగంగా పూర్తి చెయ్యాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.రైల్వే అధికారులు ఈ సమావేశంలో జిల్లాలో చిన్నకోడూరు, నారాయణ రావు పేట మండలాల్లో పెండింగ్ లో ఉన్న భూ సేకరణ వివరాలు గూర్చి రైల్వే అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఈ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ.... చిన్నకోడూరు మండలం లో పెద్దకోడూర్ చిన్నకోడూరు మాచాపూర్ గంగాపూర్ విఠలాపూర్ నారాయణరావు పేట మండలం లో గుర్రాల గొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్ లో ఉన్న భూసేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయా మండల తహసీల్దార్ లకు తెలిపారు. ఆయా భూసేకరణను వేగంగా పూర్తి చేసి రైల్వే అధికారులకు అప్పగించాలని తెలిపారు. కొన్ని గ్రామాల్లో స్టోన్ బ్లాస్టింగ్ వలన పంట నష్టపోతున్న రైతులు నష్ట పరిహారం అందాకే పనులు జరపాలని రైతులు అడ్డుతగులుతున్నారని తెలిపారు. త్వరగా నష్ట పరిహారం అందించాలని కలెక్టర్ రైల్వే అధికారులకు తెలిపారు. ఈ సమావేశం లో ఆర్డిఓ పి. సదానందం, రైల్వే అధికారులు మూర్తి, జనార్దన్ మరియు ఇతర అధికారులు అయా మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యం కారణంతో వ్యక్తి ఆత్మహత్య





నవతెలంగాణ-రాయపోల్: అనారోగ్యం కారణతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన తుడుం నర్సయ్య (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత సంవత్సర కాలం నుంచి నర్సయ్య తీవ్రమైన కడుపునొప్పి , ముక్కులో నుంచి రక్తం కారడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. హైదరాబాద్ ఈఎస్ టీ ఆసుపత్రిలో వైద్యం చేయించినప్పటికీ తగ్గలేదు. ఆరోగ్యపరంగా తరచూ ఇబ్బంది పడుతున్నాడు. ఆదివారం రాత్రి అందరితో పాటే భోజనం చేసి ఇంట్లో నిద్రపోయాడు. సోమవారం కుటుంబ సభ్యులు నిద్రలేవకముందే తెల్లవారుజామున వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు.ఎన్ని రోజులు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నగాని ఆరోగ్యం కుదుటపడడం లేదని బాధపడుతూ జీవితం పై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తెల్లవారిన తర్వాత గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వాళ్లు వచ్చి చేసేసరికి నర్సయ్య అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితం పై విరక్తి చెంది మా నాన్న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని మృతుడి చిన్న కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.

గొల్ల కురుమల సంక్షేమానికి కృషి కేసీఆర్

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ : గొల్ల కురుమల సంక్షేమానికి గత ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రి హెూదాలో కృషి చేశారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్ మండలం అమ్మది పూర్ గ్రామంలో బీరప్ప స్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి గత ప్రభుత్వం తీసుకుని చర్యలను వారు గుర్తు చేశారు. గొల్ల కురుమల సంక్షేమానికి ఆర్థిక బలోపేతానికి కేసీఆర్, హరీశ్ రావు గజ్వేల్ ప్రాంతంలో ఎంతో కృషి చేశారని వారు గుర్తు చేశారు. మాంస ఉత్పత్తిలో ఒక విప్లవాన్ని సృష్టించిందని వారు చెప్పారు. గొల్ల కురుమల జీవితాల్లో వెలుగు నింపేందుకు గొర్రెల పంపిణీ పథకాన్ని కెసిఆర్ తీసుకొచ్చినట్లు వారు గుర్తు చేశారు. మటన్ దిగుమతి చేసుకొని స్థాయి నుంచి ఎగుమతి చేసుకునే స్థాయికి గొల్ల కురుమలు ఎదిగినట్లు వారు చెప్పారు. ఈ పథకాలను కొనసాగించాలని వారు కోరారు. ఇంకా ఈ కార్యక్రమం లో బీరప్ప ఉత్సవాలకు హాజరైన పెద్దలకు ప్రతాప్ రెడ్డి, మాదాస్ శ్రీనివాస్, గజ్వేల్ జెడ్పిటిసి పంగ మల్లేష్, నాయకులు రాజ్ రెడ్డి, ఆనందం, రమేష్ గౌడ్, హైమద్, నిజాముద్దీన్, సత్య గౌడ్, చాకలి శ్రీనివాస్, రాములు, ముత్యం గౌడ్, కొండల్ రెడ్డి, గ్రామ కురుమ సంఘం నాయకులు బీరయ్య, బాలయ్య, ఐలయ్య, స్వామి, సంతోష్, రాములు, యాదగిరి, రాజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కరాటే మెగా ఛాంపియన్‌షిప్ విజేతగా ప్రణవి



నవతెలంగాణ-మద్దూరు:

గోవాలో జరిగిన యూనివర్సల్ 369 షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కరాటే మెగా ఛాంపియన్షిప్ టోర్నమెంట్‌లో మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన బట్టల వెంకటేష్ కూతురు బట్టల ప్రణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది, ఫైరింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ కరాటే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి రెండు పతకాలను స్వాధీనం చేసుకున్న ప్రణవిని సినీ నటుడు సుమన్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు ప్రత్యేకంగా అభినందించారు. ప్రణవి గత ఏడేళ్లుగా కరాటేలో శిక్షణ తీసుకొని బ్లాక్ బెల్ట్ ను సాధించారు. ప్రణవి చదువుతోపాటు కరాటేలో రాణిస్తూ ఉండడం పట్ల ఆమె తల్లిదండ్రులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రణవి హైదరాబాదులోని ఓ ప్రైవేటు స్కూల్లో ఏడో తరగతి పూర్తి చేసింది.

గాగిలాపూర్ చెరువులో చేపల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-మద్దూరు: మండలంలోని గాగిలాపూర్ పెద్ద చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు చేపలు చోరీకి పాల్పడంతో సోమవారం ముదిరాజ్ సంఘం కుల పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల పెంపకం పై ఆధారపడి జీవిస్తున్న తమకు నష్టం చేకూర్చే విధంగా గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో అక్రమంగా చెరువులోకి ప్రవేశించి గత కొన్ని రోజులుగా చేపల వేట సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలను అక్రమంగా పట్టుకొని తమకు నష్టం చేస్తున్న వ్యక్తులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.